క్లుప్తంగా

అమ్మవారి విగ్రహం వితరణ



అన్నపూర్ణేశ్వరిదేవి విగ్రహం

పెద్దతిప్పసముద్రం : స్థానిక శివాలయానికి అన్నపూర్ణేశ్వరిదేవి విగ్రహాన్ని పీటీఎంకు చెందిన పూల సుభద్రమ్మ, గంగుల్‌రెడ్డి దంపతులు వితరణ చేసినట్లు ఆలయ సేవకులు సనగరం పట్టాభి రామయ్య తెలిపారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆలయంలో అమ్మవారి ప్రతిమకు పంచామృతాభిషేకం, పూర్ణాహుతి, హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు.

23న సింహగర్జనను విజయవంతం చేయండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

పీలేరు రూరల్ : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ ఈ నెల 23న తిరుపతిలో నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న సింహగర్జనను విజయవంతం చేయాలని మాలమహానాడు జేఏసీ అధ్యక్షుడు యమలా సుదర్శనం అన్నారు. శుక్రవారం పీలేరులోని ఫిరోజ్ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ మాలల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సింహగర్జన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు జేఏసీ నాయకులు పూతపట్టు ప్రభాకర్, మధు, ధనశేఖర్, చంద్రయ్య, లక్ష్మీనారాయణ, ధరణికుమార్, శివయ్య, భానుప్రకాష్, హరి తదితరులు పాల్గొన్నారు.

రేపు ట్రస్టు సమావేశం

తంబళ్లపల్లె : స్థానిక మల్లయ్యకొండ కింద శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి వెల్ఫేర్ అసోసియేషన్ (అన్నదాన కమిటీ) భవనంలో ఆదివారం ఉదయం 10.30 గంటలకు కమిటీ సమావేశం జరుగుతుందని కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖరరెడ్డి, నారాయణరెడ్డి తెలిపారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి సమష్టి కృషి

- మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



మదనపల్లె : వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఫకృద్దీన్ షరీఫ్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



పీలేరు : పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న లక్ష్మీరామకృష్ణ

మదనపల్లె : వైఎస్సార్‌సీపీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మదనపల్లెకు వచ్చిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని నియోజకవర్గ ఐటీ విభాగం అధ్యక్షులు డాకరాజు అరవింద్ తిలక్, మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పుష్పగుచ్ఛం అందించి, తనపై నమ్మకంతో పార్టీ బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రభుత్వ వైఫల్యాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ప్రజలకు అందిన సంక్షేమాన్ని గుర్తుచేసేలా పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్, రాష్ట్ర సీనియర్ నాయకులు బాబ్‌జాన్, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ కన్వీనర్‌కు మాజీ మంత్రి పరామర్శ

వైఎస్సార్ సీపీ రాయలసీమ జిల్లాల కన్వీనర్, పుంగనూరు నాయకులు ఫకృద్దీన్ షరీఫ్‌ను మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పరామర్శించారు. శుక్రవారం మదనపల్లెలోని ఓ ప్రైవేట్ నర్సింగ్‌హోమ్‌లో గుండెపోటుకు చికిత్స పొందుతున్న షరీఫ్‌ను ఆయన కలిశారు. ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుంటావని, భయపడాల్సిన పనిలేదని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా షరీఫ్‌కు అందించిన చికిత్స వివరాలను డాక్టర్లు మాజీ మంత్రికి తెలిపారు. మరింత మెరుగైన వైద్యం అందించాల్సిందిగా ఆయన సూచించారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డితో కలిసి ఫకృద్దీన్ షరీఫ్‌ను పరామర్శించిన వారిలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్‌తిప్పారెడ్డి, వైఎస్సార్ సీపీ సీనియర్ రాష్ట్ర నాయకులు బాబ్‌జాన్, మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా వెంకటాచలపతి, హజ్‌కమిటీ మాజీ డైరెక్టర్ ఖాదర్ తదితరులు ఉన్నారు.

మహిళా విభాగాన్ని పటిష్టం చేయాలి

పీలేరు : వైఎస్సార్‌సీపీ పటిష్టతకు మరింత కృషి చేయాలనీ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. పీలేరు పట్టణానికి చెందిన లక్ష్మీరామకృష్ణ వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలుగా నియమితులయ్యారు. దీంతో ఆమె శుక్రవారం మాజీ మంత్రిని కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేయడంలో మహిళా విభాగంలో కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనకు పదవి ఇవ్వడానికి సహకరించిన మాజీ మంత్రితోపాటు ఎంపీ మిథున్‌రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



పీలేరు రూరల్ : మహిళా దినోత్సవంలో కేక్ కట్ చేస్తున్న డీఎం పి. నిర్మల



మదనపల్లె సిటీ: మాట్లాడుతున్న రెండవ అదనపు జిల్లా జడ్జి అబ్రహాం

పీలేరు రూరల్ : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆర్టీసీ డీఎం పి.నిర్మల అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ కార్యాలయంలో ముందస్తు మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి ఆర్టీసీ ఉద్యోగులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు తమ శక్తిని చాటుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ డిపో అధ్యక్ష, కార్యదర్శులు రమణ, ఖాదర్‌బాషా, శోభారాణి, రాధ, శ్రీదేవి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలు తప్పనిసరి

మదనపల్లె సిటీ : నేటి కాలంలో మహిళా సాధికారత సాధించాలంటే నైతిక విలువలు తప్పనిసరని రెండవ అదనపు జిల్లా జడ్జి అబ్రహాం అన్నారు. శుక్రవారం ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో అవగాహన కార్యక్రమం జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి, ధాత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు స్వాతి, న్యాయవాది బాలజ్యోతి, రేవతి ఫౌండేషన్ వ్యవస్థాపకులు రామమూర్తి, డబ్ల్యుఈసీ కో ఆర్డినేటర్ వనజ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు విష్ణుప్రియ, జ్యోతి, మోహన్‌బాబు, గురుమూర్తి, ఖాజావల్లి తదితరులు పాల్గొన్నారు. ముందుగా విద్యార్థులు, అధ్యాపకులకు ఆటల పోటలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు.

ఇళ్ల నిర్మాణాలకు అదనపు ఆర్థిక సాయం



హౌసింగ్ ఏఈ దీనదయాళ్‌రాజు

మదనపల్లె : మున్సిపాలిటీలో ఇంటి నిర్మాణాలకు సంబంధించి ప్రస్తుతం ఇస్తున్న ఆర్థిక సహాయానికి అదనంగా బీసీలు, షెడ్యూల్ కులాల వారికి రూ.50 వేలు, షెడ్యూల్డ్ తెగలవారికి రూ.75 వేలు అదనపు సహాయం అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని హౌసింగ్ ఏఈ దీనదయాళ్‌రాజు తెలిపారు. శుక్రవారం స్థానిక హౌసింగ్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ మదనపల్లె మున్సిపాలిటీలోని బీసీ-1,597, ఎస్సీ-156, ఎస్టీ-74 మొత్తం కలిపి 1,827 ఇళ్లకు అదనపు ఆర్థిక సహాయం వర్తిస్తుందన్నారు. అదనపు ఆర్థిక సహాయం బేస్‌మెంట్, గోడలు, మోల్డింగ్ నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న వారందరికీ వర్తిస్తుందన్నారు. ప్రతి లబ్ధిదారుడు ఏప్రిల్‌లోపు ఈ అదనపు ఆర్థిక సహాయాన్ని అందుకుని, ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని కోరారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటా

- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



నాయకులతో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడి

తంబళ్లపల్లె : పార్టీ అధికారంలో లేదని ఎవరూ అధైర్యపడవద్దు.. ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా.. ఎలాంటి సమస్యలు వచ్చినా పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం తంబళ్లపల్లెకు వచ్చారు. తంబళ్లపల్లె, పెద్దతిప్పసముద్రం, ములకలచెరువు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో విడివిడిగా చర్చించారు. వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసేందుకు అందరూ సమష్టిగా పని చేయాలని సూచించారు. నూతనంగా పార్టీ పదవులు పొందిన వారు ఎమ్మెల్యేకి పుష్పగుచ్ఛాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ చౌడేశ్వర్, వైస్ ఎంపీపీ కరీమ్, కోఆప్షన్ సభ్యులు జమాల్‌బాషా, నాయకులు పద్మనాభరెడ్డి, మల్లికార్జున, బాలకృష్ణారెడ్డి, రామమూర్తి, రెడ్యం కృష్ణారెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతకు ప్రతీక ఇఫ్తార్ విందు



దీక్షపరులకు ఆహార పొట్లాలు అందజేస్తున్న నిస్సార్‌అహ్మద్

మదనపల్లె సిటీ : ఐక్యతకు ఇఫ్తార్‌లు చిహ్నమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్ అన్నారు. శుక్రవారం మదనపల్లె పట్టణం రామారావుకాలనీలో మస్జిద్-ఏ-హజ్రత్ అబూ హనీఫాలో రంజాన్ మాసం పురస్కరించుకుని ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. పవిత్ర రంజాన్‌మాసంలో ఎంతో నిష్ఠతో ఆచరించే ఉపవాసదీక్షలు విరమించే సమయంలో ఇఫ్తార్ ఇవ్వడం ఎంతో పుణ్యకార్యమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కరీముల్లా, నూర్, యూనిస్, మహమ్మద్‌కిజర్, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలి

మదనపల్లె మండలం కోళ్లబైలు పంచాయతీ బాబుకాలనీలోని మజ్జిద్ ఏ అక్సా మసీదులో రంజాన్ మాసం పురస్కరించుకుని శుక్రవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఎస్.నిస్సార్ అహ్మద్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం స్థానికులతో సమావేశం నిర్వహించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో కోళ్లబైలు వైస్ సర్పంచు సమద్, నాయకులు ఎస్.ఎ.కరీముల్లా, యాసీన్, అబ్దుల్లా, బజివుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణపై దృష్టి సారించండి



చెత్త నుంచి సంపద తయారీని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో నాగరాజు

పెద్దమండ్యం : గ్రామాల్లో చెత్త సేకరణపై దృష్టి సారించి, చెత్త నుంచి సంపద తయారీని వేగవంతం చేయాలని డీఎల్‌పీవో నాగరాజు అన్నారు. మండలంలోని ఎన్‌వోపల్లె, పెద్దమండ్యం గ్రామాల్లో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలలో ఇంటింటి చెత్త సేకరణ జరగాలని అన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ బాధ్యత గ్రామ పంచాయతీలదేనని స్పష్టం చేశారు. అన్ని గ్రామ పంచాయతీలలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పూర్తిగా వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. డీఎల్‌పీవో వెంట ఎంపీడీవో శ్రీధర్‌రావు, పంచాయతీ కార్యదర్శులు సుబ్రమణ్యం, జనార్దన్, లక్ష్మీప్రసన్న, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.



ముందస్తు మహిళా దినోత్సవం వేడుకలు

రాయచోటి అర్బన్: మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని రాయచోటి ఐసీడీఎస్ సీడీపీఓ సుగుణమ్మ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాలలో శ్రామిక మహిళా సంఘం, సీఐటీయూ, ఐద్వా ఆధ్వర్యంలో ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. సుగుణమ్మ మాట్లాడుతూ మహిళలు బాగా చదువుకుని అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ హైదర్‌అలీ సీఐటీయూ జిల్లా కార్యదర్శులు రామాంజులు, భాగ్యలక్ష్మి, అధ్యాపకురాలు విజయలక్ష్మి పాల్గొన్నారు.

వనితా... నీకు వందనం

కడప కల్చరల్ : నేటి తరం మహిళ అన్ని రంగాల్లో పురుషుడితో సమానంగా అభివృద్ధి సాధిస్తోంది. ఒక దశలో పురుషుల కంటే ఎక్కువగానే దూసుకుపోతోంది. హిందూ పురాణాల్లో కూడా మహిళకు ఎంతో ప్రాధాన్యత కనిపిస్తోంది. త్రిమూర్తుల్లో ... విష్ణుమూర్తి లక్ష్మీదేవిని హృదయంలో నిలుపుకోగా, శక్తిస్వరూపిణి పార్వతీమాతకు ఈశ్వరుడు సగం శరీరం అర్పించగా, బ్రహ్మ చదువుల తల్లి సరస్వతీమాతను నాలుకపై ప్రతిష్ఠించుకున్నారని పురాణాల ద్వారా తెలుస్తోంది.

ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న మార్పుల్లో భాగంగా నేటి మహిళకు విద్య అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం బాలుర కంటే బాలికలే ఎక్కువగా విద్యను అభ్యసిస్తున్నారు. పోటీ పరీక్షల్లో కూడా బాలికలదే అగ్రస్థానం. అట్టడుగు పనుల నుంచి ఇతర గ్రహాలకు వెళ్లడంలో కూడా మహిళ తెగువ చూపుతోంది. ఆమె నేర్చుకోలేని విద్య లేదు. చేయని పని లేదు. అత్యంత కష్టమైన బస్సు కండక్టర్ మొదలుకొని రైళ్లు, విమానాలు నడిపే స్థాయికి ఎదిగి ఇతరులకు స్ఫూర్తినిస్తోంది. దేశంలోని మహిళా అధికారుల సంఖ్య పురుషులతో పోటీ పడుతుండడం గమనార్హం.

మహిళ లేనిదే మానవ మనుగడను ఊహించుకోలేం. ఆకాశంలో సగంగా పేరు పడిన మహిళకు అవకాశాల్లో మాత్రం ఒకింత వెనుకబడి ఉంది. కానీ ఎనలేని ఆత్మవిశ్వాసంతో సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ రంగాలలో కూడా రాణిస్తున్నారు.

మహిళా దినోత్సవం గురించి..

అంతర్జాతీయ మహిళా దినోత్సవం 20వ శతాబ్దంలో మొదలైంది. ఉత్తర అమెరికా, యూరప్‌లోని కార్మిక ఉద్యమాల ద్వారా దీనికి పునాదులు పడ్డాయి. మొదటి జాతీయ మహిళా దినోత్సవాన్ని యునైటెడ్ స్టేట్స్‌లో 1909 ఫిబ్రవరి 28న నిర్వహించారు. న్యూయార్క్‌లో సోషలిస్టు మహిళలు, వస్త్ర కార్మికులు తక్కువ పనిగంటలు, అధిక వేతనాలు, ఓటుహక్కు డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శనలు చేశారు. అలా మహిళా దినోత్సవం ప్రారంభమైంది. 1910లో కోపెన్ హాగన్‌లో జరిగిన అంతర్జాతీయ మహిళా సమావేశంలో క్లారా జెట్కిన్ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రతిపాదించగా ఆమోదింపబడింది. ఈ దినోత్సవాన్ని మొదటిసారిగా 1911లో అనేక యూరోపియన్ దేశాల్లో నిర్వహించుకున్నారు. 1975లో ఐక్యరాజ్య సమితి అధికారికంగా మహిళా దినోత్సవాన్ని నిర్వహించడం ప్రారంభించింది. 1977లో ఐక్య రాజ్య సమితి మార్చి 8న మహిళా హక్కులు, ప్రపంచ శాంతి కోసం ఐక్య రాజ్య సమితి దినోత్సవంగా ప్రకటించాలని ఆహ్వానించింది. దాంతో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మార్చి 8న నిర్వహించుకోవడం మొదలు పెట్టారు. 2025 మహిళా దినోత్సవాన్ని క్రియాశీలత అనే అంశంపై నిర్వహించుకుంటున్నారు. మహిళలు, బాలికల హక్కులు సాధికారత, సమాన అవకాశాలు, వివక్ష తొలగింపు తదితర అంశాలపై సంస్థలు కృషి చేయనున్నాయి. అందువల్ల మహిళా దినోత్సవం రోజున ప్రభుత్వ సంస్థలతోపాటు వివిధ స్వచ్ఛంద సంఘాలు, ప్రభుత్వ ఆధ్వర్యంలోని సంఘాలు ఈ దినోత్సవం గురించి ప్రచారం నిర్వహిస్తాయి. స్ఫూర్తిదాయకమైన మహిళలను ఈ సందర్భంగా సత్కరిస్తున్నారు.

ఆ పాఠశాల.. ఉపాధ్యాయినులు భళా!

- జెడ్పీ పాఠశాలలో అత్యధికంగా మహిళామణుల 'కొలువు'
- మొత్తం టీచింగ్ స్టాఫ్ 72 మంది
- మహిళా ఉపాధ్యాయులు 47 మంది
- ఐదుగురు నాన్ టీచింగ్ మహిళా ఉద్యోగులు



జెడ్పీ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న మహిళా ఉపాధ్యాయులు

మదనపల్లె సిటీ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అతిపెద్దది, వందేళ్లకు చేరువలో ఉన్న మదనపల్లె పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. విద్యార్థుల ప్రవేశాలు, ఉత్తమ ఫలితాల సాధనలో ముందంజలో ఉంటుంది. ప్రతి ఏడాది ఉత్తమ ఫలితాలు సాధిస్తూ అందరి మన్ననలు పొందుతుంది. అత్యధికంగా 52 మంది మహిళా ఉపాధ్యాయులు పని చేస్తున్న పాఠశాలగా మరో ప్రత్యేకత సంతరించుకుంది. ఆరు నుంచి పదో తరగతి వరకు 1350 మంది విద్యార్థులుండగా... ఇక్కడ బోధించేందుకు 72 టీచర్ పోస్టులున్నాయి. 47 మంది మహిళా ఉపాధ్యాయులు పని చేస్తుండగా మరో ఐదుగురు నాన్ టీచింగ్ స్టాఫ్ ఉన్నారు. మొత్తం 52 మంది మహిళలు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి తెలిపారు. పాఠశాలలో 52 మంది మహిళా ఉద్యోగులు పని చేయడం గర్వంగా ఉందన్నారు.

విద్యతోనే మహిళా సాధికారత

రాజంపేట: విద్యతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని కడప వై వి యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పి. పద్మ అన్నారు. శుక్రవారం రాజంపేట అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో మహిళా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి. పద్మ మాట్లాడుతూ మహిళా విద్యను ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలను వివరించారు. మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎస్.ఆర్. గౌతమి మాట్లాడుతూ మహిళలకు విద్య, పరిశోధన రంగాల్లో మరింత మద్దతు అందించాల్సిన అవసరాన్ని అభిప్రాయపడ్డారు. అన్నమాచార్య విశ్వవిద్యాలయం కులపతి డాక్టర్ సి. గంగిరెడ్డి, ఉపకులపతి సాయిబాబారెడ్డి, అన్నమాచార్య విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ సి. అక్షయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాయచోటి జగదాంబసెంటర్ : మహిళా సాధికారతతోనే సమాజంలో అభివృద్ధి సాధ్యమవుతుందని ఎస్బీఐ చీఫ్ మేనేజర్ ఎస్‌డీవీఎస్ జగదీష్ అన్నారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రాయచోటి ప్రధాన బ్రాంచ్‌లో సాయి ప్రశాంతి ఆసుపత్రి, డాక్టర్ అగర్వాల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఆంజనేయులు, ఏఎల్డీఎం బాషా తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట టౌన్: ప్రస్తుతం మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని మన్నూరు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె.పరిమల తెలిపారు. ఈ నెల 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం కుటుంబం, సమాజం, దేశాభివృద్ధిలో మహిళల పాత్ర అనేక అంశంపై రాజంపేట ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. రాజంపేట ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు బసోటి భాస్కర్, సాంబశివనాయుడు, ఓబులేసు, మందా శివయ్య, సునీల్, మండ్ల శ్రీహరి, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.